క్లుప్తంగా

అర్చకుల ఆత్మీయ సమ్మేళనం



లబ్బీపేట(విజయవాడతూర్పు): తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్(ఎస్ఎస్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్మితమైన దేవాలయాల ఎస్సీ, ఎస్టీ, మత్స్యకార అర్చకుల ఆత్మీయ సమ్మేళనం శనివారం లబ్బీపేటలోని ఓ ఫంక్షన్ హాలులో జరిగింది. ఈ సమ్మేళనంలో 651 మంది అర్చకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ అఖిల భారత కార్యదర్శి శ్యాంప్రసాద్ మాట్లాడుతూ అర్చకులైనప్పటికీ మనమందరం ఎస్ఎస్ఎఫ్ కార్యకర్తలుగా హిందూ ధర్మ ప్రచారం కోసం మారుమూల గ్రామాల వరకూ పనిచేయాలన్నారు. మత మార్పిడులను ఆపి, మారిన వారిని తిరిగి హిందూ మతంలోకి ఆహ్వానించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ అధ్యక్షుడు విష్ణు, శ్రీకమలానందభారతిస్వామి, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, వీహెచ్‌పీ అఖిల భారత ప్రముఖ్ గోకరాజు గంగరాజు, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ విజయాదిత్య, శ్రీ విరజానందస్వామి తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ



విజయవాడ కల్చరల్: తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యాన శనివారం పున్నమ్మతోటలోని టీటీడీ కల్యాణ మండపంలో దాతల సహకారంతో అన్నప్రసాద వితరణ చేశారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమాదేవి మాట్లాడుతూ టీటీడీ అధికారుల సూచన మేరకు వారంలో నాలుగు రోజులపాటు దాతల సహకారంతో అన్నప్రసాదం అందిస్తునట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే దాతలు కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ముందుగా కల్యాణ మండపంలో కొలువైవున్న పద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్దాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులను సమర్థంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు సూచించారు. నగరంలో వివిధ పాఠశాలల్లో శనివారం జరిగిన ఉపాధ్యాయుల క్లస్టర్ స్థాయి సమావేశాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులను రానున్న పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించే దిశగా చక్కగా తీర్చిదిద్దాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే వివిధ పరీక్షలు, ప్రదర్శనల్లో పాల్గొనే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. కేవలం మార్కులే కాకుండా అన్ని అంశాల్లోనూ రాణించే విధంగా చూడాలన్నారు. నగరంలోని ఏకేటీపీఎం హైస్కూల్, సీవీఆర్ హైస్కూల్ తదితర ప్రాంగణాల్లో జరిగిన సమావేశాలకు ఆయన హాజరయ్యారు.

మధురంగా సాగిన సంగీత కచేరీలు



విజయవాడ కల్చరల్: శ్రీసుబ్రహ్మణ్య సంగీత సమితి ఆధ్వర్యాన దుర్గాపురంలోని ఆ సంస్థ కార్యాలయంలో సంగీత మహోత్సవాల సందర్భంగా శనివారం యువ కళాకారుల సంగీత కచేరీలు మధురంగా సాగాయి. తొలి కార్యక్రమంలో యువ సంగీత కళాకారిణి చారుగండ్ల శ్రావణి వేణువుపై సంగీత సద్గురువులు త్యాగరాజస్వామి, ముత్తుస్వామి దీక్షితార్ శ్యామశాస్త్రి, త్యాగరాజ స్వామి రచించిన కీర్తనలు మధురంగా పలికించారు. అమ్మా ఆనందదాయని, సకల గణాధిప, దేవ దేవ కలయమిదే, రాగ సుధారస, శ్రీకాంతి మతిం, బ్రోవ భారమా తదితర కీర్తనలు చోటు చేసుకున్నాయి. సాయి శ్రీకర్, కార్తికేయ ఆదినారాయణ వాద్య సహకారం అందించారు. చివరిగా జొన్నలగడ్డ శ్రావణి కర్నాటక సంగీతంలోని పలు రాగాలను పలికించారు. సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ యువ కళాకారులకు ప్రోత్సాహం ఇవ్వాల్సిన అవసరముందని పేర్కొన్నారు. సంగీత సమితి ప్రధాన కార్యదర్శి సీవీ రావు, ఉపాధ్యక్షురాలు చిట్టా రామలక్ష్మి పాల్గొన్నారు. అనంతరం యువ సంగీత కళాకారులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

రేపటి నుంచి దసరా మహోత్సవాలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): బస్టాండ్ సమీపంలోని శ్రీ కాశీమాత అమ్మవారి దేవస్థానం (త్రిశక్తిపీఠం)లో ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని దేవస్థానం పాలకవర్గ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు గొల్లపూడి పుల్లయ్య, కె.జగదీష్‌కుమార్ తెలిపారు.

ఇక్కడ చచ్చినా..చావే!

- మృతదేహాల ఖననానికి స్థలం లేని వైనం
- సమాధుల తోటలో కొత్త స్థలం కరువు
- పాత సమాధులుంటే వాటిపైనే కట్టుకోమంటున్న నిర్వాహకులు
- వందేళ్లకుపైగా చరిత్రగల భవానీపురం క్రైస్తవ శ్మశానవాటిక దుస్థితి
- ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలని కొన్నేళ్లుగా వినతులు

మనిషి పుట్టిన దగ్గర నుంచి గిట్టే వరకు ఎన్నో కష్టసుఖాలు అనుభవించి చివరికి చనిపోతే శవపేటికలో పెట్టి పూడ్చిపెట్టడానికి (ఖననం) అక్కడ స్థలం లేదు. స్థలాభావంతో ఒక సమాధిపై మరొకటి, దానిపై ఇంకొకటి ఇలా అపార్ట్‌మెంట్ తరహాలో కట్టుకోవాల్సిన పరిస్థితి. ఇక్కడ చచ్చినా చావే... అని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.



భవానీపురంలోని క్రైస్తవ శ్మశానవాటిక

భవానీపురం(విజయవాడ పశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ పరిధిలో చనిపోయిన క్రైస్తవ మతస్తులను భవానీపురం క్రైస్తవ శ్మశానవాటికలో ఖననం చేస్తారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న (బ్రిటిష్ పాలనలో ఏర్పాటైన) ఈ శ్మశానవాటికలో ప్రస్తుతం స్థలం కరువైంది. బ్రిటిష్ పాలకులకు సంబంధించిన సమాధులు కూడా ఈ శ్మశానవాటికలో ఉన్నాయని చూసిన వయోవృద్ధులు చెబుతున్నారు. హైదరాబాద్ జాతీయ రహదారికి అనుకుని ఉన్న ఈ శ్మశానవాటిక వన్‌టౌన్ తారాపేటలోని ఆర్‌సీఎం చర్చి నిర్వహణలో ఉంది. ప్రతి ఏటా నవంబర్ 1వ తేదీన 'ఆల్ సెయింట్స్ డే'(సమస్త పరిశుద్ధుల దినం)గా, జన్మనిచ్చిన తల్లిదండ్రులు, వారి పూర్వీకుల ఆత్మలకు శాంతి కలిగేలా 2వ తేదీన 'ఆల్ సోల్స్ డే' (సమస్త ఆత్మల దినం)గా పూజలు నిర్వహించే సంప్రదాయం బ్రిటిష్ పాలకుల నుంచే వచ్చిందని చెబుతారు.

పాత సమాధులుంటే వాటిపైనే కట్టుకోండి

వందేళ్ల కిందటి శ్మశానవాటిక కావడంతో నాటి నుంచి లక్షలాది మంది క్రైస్తవులను ఖననం చేసి సమాధులు కట్టడంతో గత కొన్నేళ్ల నుంచి ఇక్కడ ఒక కొత్త సమాధి కూడా కట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచే అపార్ట్‌మెంట్‌లో ఫ్లోర్స్‌లా ఒక సమాధిపైనే ఇంకొకటి, దానిపై మరొకటి..ఇలా ఒకే స్థలంలో ఐదారుగురి సమాధులు ఉంటున్నాయి. అయినప్పటికీ ఇంకా స్థలం కొరతగానే ఉంది. ప్రస్తుతం శ్మశానవాటికకు మృతదేహం వస్తే ఎక్కడ ఖననం చేయాలో అర్థంకాక తలలు పట్టుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఆర్‌సీఎం చర్చికి చెందిన ఫాదర్ విజయకుమార్ శ్మశానవాటిక మొదట్లో గోడపై ఒక నోటీస్ బోర్డ్ పెట్టారు.

'' 'క్రైస్తవ సహోదరి, సహోదరులకు.. మన సమాధుల తోటలో కొత్త స్థలం లేదు. మీకు చెందిన పాత సమాధులు ఉంటే వాటిమీద కట్టించుకోండి. అందుకు సహకరించండి.'' ఇదీ ఆ నోటీస్ బోర్డులో సారాంశం.

దారితెన్ను లేక సమాధులు కట్టుకోవడానికి అవస్థలు

క్రైస్తవ శ్మశానవాటిక మొదట్లో సుమారు ఐదు అడుగుల వెడల్పులో రోడ్డు ఉన్నప్పటికీ కాలక్రమేణా కేవలం నడక దారి మాత్రమే మిగిలింది. ఆ దారిగుండానే లోపల ఉన్న తమ వారి సమాధుల దగ్గరకు వెళ్లి ప్రతి ఏటా నవంబర్ 2వ తేదీన (సమాధుల పండుగ) పూజలు, కొవ్వొత్తులు వెలిగించుకుని స్మరించుకుంటూ వస్తున్నారు. లోపల ఎక్కడైనా కొద్దిపాటి స్థలం కనిపించినా దారీతెన్నూ లేని మార్గంలోనే వెళ్లి సమాధులు కట్టించుకుంటున్నారు. ఈ శ్మశానవాటికకు ప్రత్యామ్నాయంగా నగర శివార్లలో ఎక్కడైనా స్థలాన్ని కేటాయించాలని గత కొన్నేళ్లుగా క్రైస్తవ సామాజికవర్గం ఎంతోమంది ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకుంటూనే ఉన్నా ఫలితం మాత్రం కనిపించటం లేదు.



అపార్ట్‌మెంట్ తరహాలో ఒకదానిపై మరొకటి సమాధులు

క్రైస్తవులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు



పశ్చిమ నియోజకవర్గంలో క్రైస్తవులు చనిపోతే ఖననం చేసేందుకు స్థలం లేక తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ స్థలం కొరత సమస్యను మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంతానికి వచ్చినప్పుడు ఆయన దృష్టికి తీసుకువెళ్లాం. ఆయన తక్షణమే స్పందించి ఐదు ఎకరాల ప్రభుత్వ స్థలం లేదా ప్రైవేట్ భూమి అయినా కొనుగోలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. అనివార్య కారణాల వలన అది సాధ్యపడలేదు. స్థానిక ప్రజాప్రతినిధులు స్పందించి క్రైస్తవ శ్మశానవాటికకు ప్రత్యామ్నాయ స్థలం కేటాయించాలి.

– దాసి జయప్రకాష్ కెనడి

పార్టీ బూత్ కమిటీలను పటిష్టం చేయాలి

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బూత్ కమిటీలను మరింత పటిష్టం చేయటానికి కృషి చేయాలని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల పార్టీ బూత్ కమిటీ విభాగ రాష్ట్ర కార్యదర్శిగా నియోజకవర్గానికి చెందిన వెలది అనిల్‌కుమార్ శర్మ నియమితులయ్యారు. ఆయన శనివారం సాయంత్రం వెలంపల్లి శ్రీనివాసరావును ఆయన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వెలంపల్లి అనిల్ కుమార్ శర్మను శాలువాతో సత్కరించారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలని, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.



అనిల్‌కుమార్‌శర్మను అభినందిస్తున్న వెలంపల్లి శ్రీనివాసరావు

పకడ్బందీగా శరన్నవరాత్రి వేడుకల ఏర్పాట్లు

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరగబోయే దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లలో ఎటువంటి లోపం తలెత్తకూడదని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శనివారం కృష్ణవేణి ఘాట్, భవానీ ఘాట్, పున్నమి ఘాట్, కెనాల్ రోడ్, వినాయకుని గుడి, వన్‌టౌన్ ప్రాంతాల్లో పర్యటించి దసరా శరన్నవరాత్రుల వేడుకల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రపంచ వ్యాప్తంగా వచ్చే అమ్మవారి భక్తులు ఇబ్బందులు పడకూడదని, భక్తులకు వీఎంసీ కల్పించే వసతులు పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యం ఏ పాయింట్ల వద్ద కల్పిస్తున్నారో, క్యూలైన్ల వద్ద సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, ఉచిత చెప్పుల స్టాండ్, మరుగుదొడ్ల పాయింట్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కన్వేయర్ బెల్ట్ పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్లు డాక్టర్ అన్నపూర్ణ, డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.



ఘాట్లను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

అంగీకార్–2025 బ్రోచర్, పోస్టర్ల ఆవిష్కరణ

పటమట(విజయవాడతూర్పు): పేద ప్రజలకు శాశ్వత గూడు కల్పించటమే అంగీకార్–2025 లక్ష్యమని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్లో శనివారం పీఎంఏవై అర్బన్ 2.0 లో భాగంగా అంగీకార్–2025 బ్రోచర్, పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధానమంత్రి ఆవాస్ యోజన – అర్బన్ 2.0 (పీఎంఏవై 2.0) – అంగీకార్ -2025 ప్రచార అవగాహన కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ లబ్ధిదారులకు, ప్రజలకు ఈ పథకం ప్రయోజనాలు తెలియజేయడం, సీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన ప్రయోజనాలను లబ్ధిదారులకు చేరవేయడం, కొత్తగా నిర్మించిన ఇళ్ల గృహప్రవేశాలు నిర్వహించడం తదితర విషయాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో అంగీకార్–2025 ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, రెండు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వీఎంసీ యూసీడీ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.వెంకట నారాయణ, సీఎల్‌టీసీ సమత, టెక్నికల్ ఎక్స్‌పర్ట్స్ సుజాత, శేఖర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఘనంగా ఏఎన్నార్ జయంతి వేడుకలు



పిల్లలకు పౌష్టికాహారం కిట్లను పంపిణీ చేస్తున్న బ్రహ్మదేశం సొసైటీ అధ్యక్షుడు వసంత కుమార్



అక్కినేని జయంతి కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పద్మవిభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం ప్రాంగణంలోని ఆయన విగ్రహం వద్ద శనివారం డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ, ఎక్స్‌రే సంస్థల ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మదేశం సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్ అక్కినేని విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ కళాకారుల నిలయమైన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని నెలకొల్పడానికి కృషి చేసిన కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) అభినందనీయులన్నారు. ఎక్స్‌రే సంస్థ పక్షాన కొల్లూరి మాట్లాడుతూ మద్రాస్ నుంచి చిత్రపరిశ్రమ హైదరాబాద్ తరలి రావడంలో అక్కినేని నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు. ఆలిండియా అక్కినేని నాగార్జున యువసేన అధ్యక్షుడు సర్దార్ సర్వేశ్వరరావు మాట్లాడుతూ తనకు అక్కినేని కుటుంబంతో ఉన్న అనుబంధాన్ని వివరించారు. అనంతరం సొసైటీ ఆధ్వర్యంలో పేద పిల్లలకు పౌష్టికాహారం కిట్స్, మాతృదేవోభవ వృద్ధుల సేవా సంస్థకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ కోశాధికారి గుర్రం ఏడుకొండలు, గోళ్ల నారాయణరావు, ఎక్స్‌రే ప్రధాన కార్యదర్శి బి.ఆంజనేయరాజు, కోశాధికారి సీహెచ్ వెంకట సుబ్బయ్య, డాక్టర్ నాగమల్లేశ్వరి, ఎస్‌కే షఫీఉల్లా, రహీం, పి.రాజారావు, సీహెచ్ పుల్లారెడ్డి, సుజాత, డి.లక్ష్మీకుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్కినేనికి స్వర నీరాజనం

విజయవాడ కల్చరల్: మహానటి సావిత్రి సంక్షేమ సంఘం ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ నటుడు, నిర్మాత, స్టూడియో అధినేత అక్కినేని నాగేశ్వరరావు జయంతి సందర్భంగా నిర్వహించిన సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అక్కినేని నాగేశ్వరరావు విద్యా వ్యాప్తి కోసం గుడివాడలో కళాశాల స్థాపించారని తెలిపారు. సావిత్రి కళాపీఠం నిర్వహించిన అనేక సభల్లో ఆయన పాల్గొన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా గాయకులు అక్కినేని చిత్రాల్లోని పాటలను ఆలపించారు. ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌కు అక్కినేని స్మారక పురస్కారం అందజేశారు. అనంతరం గాయకులను నిర్వాహకులు సత్కరించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు వేముల హజరత్తయ్య గుప్తా, ప్రభల శ్రీనివాస్, నవనీతం సాంబశివరావు, కే డేవిడ్‌రాజు, బీవీ వీరభద్రరావు, ప్రసూనారామన్, నవనీతం సాంబశివరావు, చింతకాయల చిట్టిబాబు పాల్గొన్నారు.

నడిచే నట గ్రంథాలయం అక్కినేని

విజయవాడ కల్చరల్: నడిచే నట గ్రంథాలయం డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు అని ప్రముఖ న్యాయవాది వేముల హజరత్తయ్య గుప్తా అన్నారు. వేముల చారిటీస్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతి వేడుకలను నిర్వహించారు. గుప్తా మాట్లాడుతూ 1941లో ధర్మపత్నితో ప్రారంభమైన ఆయన సినీ ప్రస్థానం 2024లో మనం సినిమా వరకు సాగిందన్నారు. ఆయనతో పలు సందర్భాల్లో వేదిక పంచుకునే అవకాశం దక్కిందన్నారు. సత్కార పత్ర సమర్పణను అందించిన సందర్భాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో మాజేటి హరిప్రసాద్, పి.రవికుమార్, ఎం.కేశవరావు, ఆళ్ళ వెంకట్రావ్, లక్ష్మి, సులోచన పాల్గొన్నారు. తొలుత కళాక్షేత్రంలోని అక్కినేని విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

2న గాంధీహిల్‌ను సందర్శించనున్న సీఎం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అక్టోబర్ రెండో తేదీన గాంధీ స్మారక స్థూపం ఉన్న విజయవాడ గాంధీహిల్‌ను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సందర్శించనున్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని చంద్రబాబు గాంధీహిల్‌పై ఉన్న ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, గాంధీ హిల్ ఫౌండేషన్ చైర్మన్ కేపీసీ గాంధీతో కలిసి శనివారం సాయంత్రం గాంధీకొండపై జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కొండను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయటానికి చేయవలసిన పనులను త్వరితగతిన పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆయా సంస్థల ప్రతినిధులు నూతనంగా నిర్మించనున్న లిఫ్ట్ పనులను పరిశీలించారు. సీఆర్‌డీఏ, హార్టికల్చర్, కన్సల్టింగ్ ఇంజినీర్లు సంబంధిత అధికారులతో మాట్లాడారు. ప్రతినిధులు చర్చించారు. కార్యక్రమంలో గాంధీ హిల్ కోశాధికారి కస్తూరి శివశంకర్, మేనేజర్ రవితేజ, సిద్ధార్థ కళాశాలల డైరెక్టర్ పాండురంగారావు, కన్సల్టింగ్ ఇంజినీర్లు రమేష్, రవీంద్ర, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డీఈవో కార్యాలయంలో స్వచ్ఛాంధ్ర



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కార్యాలయ ప్రాంగణంలో శనివారం స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో యూవీ సుబ్బారావుతో పాటుగా పలువురు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. ప్రాంగణంలోని పిచ్చి మొక్కలను తొలగించి పలు మొక్కలను నాటారు. కార్యాలయ ప్రాంగణంలో ఉన్న చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా డీఈవో సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమతమ పరిధుల్లో ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు కొత్త అమ్మవారు ముస్తాబు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాలను పురస్కరించుకుని చిట్టినగర్‌లో ఉన్న శ్రీ నగరాల మహాలక్ష్మీ (కొత్త అమ్మవారి) దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఈనెల 22వ తేదీ సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాలలో అమ్మవారికి 11 విశేష అలంకారాల్లో భక్తులు దర్శించుకోవచ్చునని ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ళ హనుమంతరావు, కోశాధికారి పిల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈనెల 22వ తేదీ మహాలక్ష్మీదేవిగా, 23న బాలా త్రిపుర సుందరీదేవిగా, 24న గాయత్రీదేవిగా, 25న అన్నపూర్ణాదేవిగా, 26న కాత్యాయినీదేవిగా, 27న శ్రీలలితా త్రిపుర సుందరీదేవిగా, 28న సంతోషిమాత దేవిగా, 29న మూలా నక్షత్రం నాడు సరస్వతిదేవిగా, 30న దుర్గాదేవిగా, అక్టోబర్ 1న మహిషాసురమర్ధినిదేవిగా, 2న రాజరాజేశ్వరిదేవిగా అలంకరిస్తారని పేర్కొన్నారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు, హోమాలను నిర్వహించడంతో పాటు కల్యాణ మండప ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఆలయ కమిటీ పేర్కొంది. 2వ తేదీ పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని, 4వ తేదీ ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.



విద్యుత్ దీపకాంతులతో మహాలక్ష్మీ అమ్మవారి ఆలయం

విద్యార్థుల ఆత్మహత్యలన్నీ వ్యవస్థాగతమైనవే

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయని, ఆ ఆత్మహత్యలన్నీ వ్యవస్థాగతమేనని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌ఓ) పేర్కొంది. శనివారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో పీడీఎస్‌ఓ ఆధ్వర్యంలో 'నేటి విద్యా విధానం – విద్యార్థుల ఆత్మహత్యలు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. పీడీఎస్‌ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు పిల్లి వాసు మాట్లాడారు. నేషనల్ క్రైమ్ రికార్డు బ్యూరో నివేదికల ప్రకారం 2024లో 13,044 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. వారిలో 2,248 మంది పరీక్షల్లో ఫెయిల్ అయిన కారణంగా ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. సాధారణ ఆత్మహత్యల రేటు కంటే విద్యార్థుల ఆత్మహత్యల రేటు రెండు శాతం అధికంగా నమోదు అయినట్లు ఎన్‌సీఆర్‌బీ లెక్కలు చెబుతున్నాయన్నారు. సమాజానికి, దేశానికి సరికొత్త ఆవిష్కరణలు అందించాల్సిన విద్యార్థులు మార్కులు, ర్యాంకుల కోసం జరుగుతున్న పోటీలో నిలబడలేక, అవమానాలను తట్టుకోలేక, బయటకు చెప్పుకోలేక ప్రాణాలు తీసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి కల్పనలో విఫలం

పీడీఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.భాస్కర్ మాట్లాడుతూ విద్యను అత్యంత ఖరీదైన సరుకుగా మార్చి, కార్పొరేట్, విదేశీ శక్తులకు అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. విద్యార్థుల్లో కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను పెంచే విధంగా పాఠ్యాంశాలను మారుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఉద్యోగాలు కల్పించకుండా విద్యార్థుల మధ్య సంక్లిష్టమైన పోటీని సృష్టిస్తున్నారని అన్నారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు నేతాజీ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ విద్యను బోధిస్తున్న ఫిన్లాండ్‌ను మన దేశం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యలో శారీరక శ్రమకు, ఆటలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అప్పుడే విద్యార్థుల ఆత్మహత్యలను నియంత్రించగలమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎస్.మోహన్, జిల్లా కమిటీ సభ్యులు, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న అధ్యాపకులు పిల్లి వాసు

అవగాహనతో మాదక ద్రవ్యాల వాడకం నిరోధం

జిల్లా ఈగల్ టీమ్ సీఐ రవీంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం కారణంగా సంభవించే దుష్ఫలితాలపై పూర్తి అవగాహన కలిగి ఉంటే వాటిని అరికట్టవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ సీఐ ఎం.రవీంద్ర అన్నారు. గొల్లపూడిలోని నలంద డిగ్రీ, పీజీ కళాశాల ఆడిటోరియంలో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. గంజాయి, కొకైన్, డ్రగ్స్ వంటి మాదక ద్రవ్యాలను ఎవరైనా విక్రయించినా, వాడుతున్నట్లు తెలిసినా తక్షణమే పోలీస్‌లకు లేదా 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇస్తే వారు అరికడతారని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో మాదక ద్రవ్యాల నిర్మూలనకు పాటుపడాలని, ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నార్కోటిక్ డ్రగ్స్ తీసుకున్నా, సరఫరా చేసినా నేరమేనని చెప్పారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్ బాబు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారడంతో యుక్తవయసులోనే తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అటువంటివారికి నవజీవన్ బాల భవన్, డాన్‌బాస్కో డీ అడిక్షన్ సెంటర్ ద్వారా ఉచిత వైద్యసేవలు, సైకాలజీ కౌన్సిలింగ్ థెరపీతో బాగు చేస్తారని, ఫోన్ నంబర్ 94904 92020లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె ఖాసిం, ఈగల్ టీం ఎస్ఐ ఎం. వీరాంజనేయులు, నీతోడు మానసిక వికాస కేంద్రం సైకాలజిస్ట్ జి.అనూష, జోనల్ కో ఆర్డినేటర్ కె.ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాల నిరోధంపై పోస్టర్లను ప్రదర్శిస్తున్న రవీంద్ర, శేఖర్‌బాబు తదితరులు

క్రౌన్ ఆఫ్ విజయవాడ ఆడిషన్లలో యువత సందడి



భవానీపురం(విజయవాడపశ్చిమ): సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ, శ్రేయాస్ మీడియా ఆధ్వర్యంలో ప్రభుత్వ సహకారంతో నిర్వహించనున్న విజయవాడ ఉత్సవ్‌లో భాగంగా శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'క్రౌన్ ఆఫ్ విజయవాడ' ఈవెంట్ ఆడిషన్లు జరిగాయి. కిడ్స్, టీన్స్, మిస్, మిసెస్ కేటగిరీలలో జరిగిన ఈ ఆడిషన్స్‌లో దాదాపు 300 మందికి పైగా పాల్గొన్న యువతీ యువకులు సందడి చేశారు. ప్రతి కేటగిరీ నుంచి 25 మందిని ఎంపిక చేయనున్నారు. ఎంపికైనవారికి ఈ నెల 21, 22 తేదీలలో ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించనున్నామని, 24న టాలెంట్ రౌండ్ అండ్ సెమీ ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. 25న గొల్లపూడిలోని విజయవాడ ఎక్స్‌పో గ్రౌండ్‌లో గ్రాండ్ ఫినాలే నిర్వహించనున్నట్లు షో డైరెక్టర్ సతీష్ అడ్డాల తెలిపారు.